క్లుప్తంగా

బీజేపీ ఇంటింటి ప్రచారం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో బీజేపీ నాయకులు ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌కు కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరేష్, సాయిలు, పీకే నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



కామారెడ్డి రూరల్ : మాలల హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మల మైసయ్య కామారెడ్డి జిల్లాకు చెందిన మాసు శ్రీనివాస్‌ను మాలల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించడం జరిగింది. ఈ కార్యక్రమం మెదక్ జిల్లా మెదక్ పట్టణం టీఎన్జీవో భవన్లో జరిగింది.

గ్రామాల్లో కాంగ్రెస్ ప్రచారం



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంతో పాటు ఎర్రాపహాడ్, కృష్ణాజీవాడి, నందివాడ, చందాపూర్, కరడ్‌పల్లి, ఎండ్రియాల్, బ్రాహ్మజివాడి తదితర గ్రామాల్లో గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థి సురేశ్ షెట్కార్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు అకిల్‌రావు, నాయకులు శ్యాంరావు, జలంధర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులున్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



బాన్సువాడ రూరల్ : బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, చట్టాన్ని ఉల్లంఘిస్తే శిక్షార్హులు అవుతారని స్త్రీ,శిశు సంక్షేమశాఖ బాన్సువాడ సీడీపీవో కళావతి అన్నారు. గురువారం మండలంలోని తాడ్కోల్ గ్రామంలో బాల్యవివాహం జరిగే అవకాశం ఉందన్న సమాచారం మేరకు గ్రామాన్ని సందర్శించారు. సదరు తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇదిలా ఉంటే సంగోజీపేట్‌లోనూ 2రోజుల క్రితం బాల్యవివాహం జరిగే అవకాశం ఉందన్న సమాచారం మేరకు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి అమ్మాయిని స్వదర్‌హోంకు తరలించారు.

ఘనంగా మహనీయుల జయంతి ఉత్సవాలు



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మహనీయుల జయంతి మాసం పురస్కరించుకొని గురువారం ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహాత్మా జ్యోతిరావ్‌ఫూలే, బాబాసాహెబ్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రావ్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సంతోష్, మండల అధ్యక్షుడు హనుమ ప్రవీణ్ తదితరులున్నారు.

నేడు సౌత్ క్యాంపస్‌లో..

భిక్కనూరు : ప్రతి ఏడాది ఏప్రిల్‌లో వర్సిటీలో మహనీయుల జయంతి ఉత్సవాలు జరుపటం ఆనవాయితీ. ముఖ్యంగా డాక్టర్ అంబేడ్కర్, మహవీర్ లాంటి మహనీయులు జయంతులను పురస్కరించుకుని సౌత్ క్యాంపస్‌లో నేడు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు సౌత్ క్యాంపస్ ప్రిన్సిపల్ సుధాకర్ గౌడ్ తెలిపారు.

విశ్వబ్రాహ్మణుల గుర్తింపునకు కృషి



కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి విశ్వ బ్రాహ్మణ సంఘం ఎన్నికలు, ప్రమాణ స్వీకారం స్థానిక గోపాలస్వామి రోడ్డులోని కాళికాదేవి ఆలయంలో జరిగింది. అధ్యక్షుడిగా వై.బ్రహ్మం, ఉపాధ్యక్షుడుగా కేశవ్, ప్రధాన కార్యదర్శిగా వడ్ల సురేష్‌కుమార్, సహాయ కార్యదర్శిగా కమ్మరి భాస్కర్, కోశాధికారిగా శంకర్ ఎన్నికయ్యారు.

నిర్మాణాలు సరే.. బిల్లులేవి..?

- పంచాయతీ భవనాలపై నిర్లక్ష్యం
- పట్టించుకోని అధికారులు



బంజపల్లిలో నిలిచిన పంచాయతీ భవన నిర్మాణ పనులు

నిజాంసాగర్(జుక్కల్) : గ్రామ పంచాయతీలకు సొంత భవనాల నిర్మాణ నిధులు మంజూరైనా బిల్లుల జాడ కరువైంది. భవన నిర్మాణ పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. అప్పుసప్పు చేసి పంచాయతీ భవన నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు బిల్లులు రాకపోవడంతో అప్పుల పాలవుతున్నారు.

నిజాంసాగర్ మండలంలో..

నిజాంసాగర్ మండలంలోని బంజపల్లి, అచ్చంపేట, బ్రాహ్మణపల్లి గ్రామ పంచాయతీలకు సొంత భవనాలను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కొక్క జీపీకి ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ. 20 లక్షల చొప్పున మంజూరయ్యాయి. గత ప్రభుత్వం హయాంలో పంచాయతీలకు సొంత భవనాలు మంజూరు కావడంతో స్థానిక నాయకులు భవన నిర్మాణాలకు ముందుకొచ్చారు. అచ్చంపేట మేజర్ జీపీలో గ్రామ పంచాయతీ నిర్మాణ పనులకు ముందుకొచ్చిన కాంట్రాక్టర్ పనులను వేగవంతంగా చేపట్టారు. అన్ని హంగులతో గ్రామ పంచాయతీ నిర్మాణం చేపట్టి ఎన్నికలకు ముందుగానే గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవం పూర్తి చేశారు. కాని ఇప్పటి వరకు సదరు గ్రామ పంచాయతీ భవనానికి సంబంధించి బిల్లులు రాకపోవడంతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ అప్పుల పాలయ్యాడు. అలాగే మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కాని సదరు జీపీ భవన నిర్మాణ పనులకు సంబంధించి బిల్లులు రాకపోవడంతో తాళం వేసి ఉంది. అలాగే బంజపల్లి జీపీలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి బిల్లులు రాక పనులు అసంపూర్తిగా నిలిచాయి. గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు పూర్తి చేసినా ఒక్క బిల్లు కూడా రాకపోవడంతో భవన నిర్మాణ పనుల కోసం చేసిన మిత్తులు తీర్చలేక ఉపాధి పనులకు వెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందని ఓ కాంట్రాక్టర్ వాపోయాడు. పంచాయతీ భవనం పూర్తవడంతో బిల్లులు చెల్లించి తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

రామారెడ్డి : జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ప్రజలను కోరారు. మండల కేంద్రం రామారెడ్డిలో గురువారం రాత్రి కాంగ్రెస్ నాయకులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రామారెడ్డి జెడ్పీటీసీ మోహన్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లక్ష్మా గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శిలాసాగర్ తదితరులున్నారు.

కాంగ్రెస్ చేరిన కౌన్సిలర్

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో 9వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ విజయలక్ష్మి గురువారం బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో పాటు సాతెల్లి మాజీ సర్పంచ్ సంఘమేశ్వర్, బీఆర్ఎస్ మైనారిటీ నాయకులు షరీఫ్ కూడా బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ సత్యనారాయణ, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సుభాష్‌రెడ్డి



సుభాష్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి బీజేపీ నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీగా వ్యవహరించిన సుభాష్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి టికెట్ దక్కకపోవడంతో బీజేపీలో చేరారు. బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. కొన్నిరోజులుగా గొంతు నొప్పి కారణంగా అనారోగ్యంతో ఉన్న సుభాష్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నుంచి పిలుపు రావడంతో ఆయన పార్టీలో చేరారు. కాంగ్రెస్ జహీరాబాద్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ గెలుపు కోసం కష్టపడి పనిచేస్తామని అన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఇంటింటికీ ఓటరు స్లిప్పుల పంపిణీ



నిజాంసాగర్(జుక్కల్) : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఓటర్ స్లిప్పులను ఇంటింటికీ పంపిణీ చేయాలని అసిస్టెంట్ ఎన్నికల అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం నిజాంసాగర్ మండల కేంద్రంలోని పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీఎల్‌వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మండల ఎన్నికల అధికారి బిక్షపతి, గిర్దావర్ అంజయ్య, డిప్యూటీ తహశీల్దార్ నవీన్ తదితరులు ఉన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సన్మానం



విద్యార్థిని నేహాగౌడ్‌ను అభినందిస్తున్న సేవాసమితి సభ్యులు



చర్వితను సన్మానిస్తూ..

భిక్కనూరు : కాచాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ గౌడ్, జ్యోతి కుమార్తె పాలమాకుల నేహా గౌడ్ ఇటీవల విడుదలైన ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో ఎంపీసీలో 466 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా గ్రామ సేవా సమితి సభ్యులు నేహను సత్కరించారు. నేహా మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగంలో రాణిస్తానన్నారు. గ్రామ సేవా సమితి సభ్యులు, గ్రామ బీజేపీ అధ్యక్షులు అనిల్ కుమార్, గాయత్రి కళాశాల యాజమాన్యం. సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన భిక్కనూరు మండలం అంతంపల్లికి చెందిన వలకొండ చర్వితను గురువారం పలువురు సన్మానించారు. అంతంపల్లి సింగిల్‌విండో సీఈవో శ్రీనివాస్,పలువురు ప్రజాప్రతినిధులు, ఆమెను సన్మానించి అభినందించారు.

కాలోజీవాడిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని కాలోజీవాడి గ్రామానికి చెందిన విద్యార్థిని ఇంటర్‌లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించారని గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన ఇదులాయి రాజిరెడ్డి, ఇదులాయి స్రవంతి కూతురైన దీక్షిత హైదారాబాద్‌లోని ఎస్ఎస్ఆర్ ఇంఫల్స్ కాలేజీలో ఇంటర్‌లో ఎంపీసీ సబ్జెక్టు చదివిందన్నారు. బుధవారం ఇంటర్ ఫస్టియర్‌లో 466 మార్కులు సాధించారన్నారు.

మొన్న బీజేపీలో.. నేడు కాంగ్రెస్‌లో..



గురువారం కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్



గత నెలలో బీజేపీలో చేరుతూ..

మద్నూర్(జుక్కల్) : డోంగ్లీ మండలంలోని దోతి మాజీ సర్పంచ్ కాశీనాథ్ పటేల్ గురువారం ఎమ్మెల్యే తోటలక్ష్మీకాంతారావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయన బీఆర్ఎస్ నుంచి గతనెల 10న ఎంపీ బీబీ పాటిల్ సమక్షంలో బీజేపీ పార్టీలో చేరారు. ఆయనతో పాటు మాజీ ఉప సర్పంచ్, మాజీ వార్డు సభ్యులు కూడా ఆయనతో పాటే బీజేపీలో చేరారు. కాని గురువారం వీరందరూ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు వద్దకు వెళ్లి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

డీసీఎంఎస్ చైర్మన్‌కు సన్మానం



బీబీపేట : ఇటీవల డీసీఎంఎస్ ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఏదుల్ల ఇంద్రసేనారెడ్డిని గురువారం దోమకొండ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్ బీబీపేటలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుతారి రమేష్, మాజీ సర్పంచ్ పాత రాజు, మధు, తదితరులు పాల్గొన్నారు.

మలేరియాను నిర్మూలిద్దాం



రామారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు



నిజాంసాగర్‌లో..

ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ఆయా పీహెచ్‌సీల పరిధిలో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దోమలు నిలువ ఉండకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అవగాహన ర్యాలీలు తీశారు.



మత్తమాలలో..



భిక్కనూరులో..



మద్నూర్‌లో..

ఆధ్యాత్మికం

రాజగోపుర శిఖరానికి అష్టోత్తర కలశాభిషేకం



దోమకొండ : మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయ రాజగోపుర శిఖర ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా గురువారం శిఖరానికి వైభవంగా అష్టోత్తర కలశాభిషేకం నిర్వహించారు. ఐదు అంతస్తుల శిఖరానికి 108 కలశాలతో భక్తులు స్థానిక కుడి చెరువు నుంచి నీటిని తీసుకొచ్చారు. వాటితో గోపుర శిఖరానికి కలశాభిషేకం చేశారు. శుక్రవారం సత్యనారాయణ వ్రతాలు, శనివారం సంకష్ట చతుర్థి 8వ వార్షికోత్సవ పూజలు అన్నదానాలు ఉంటాయని ఆలయ ప్రధానార్చకులు భావి కృష్ణమూర్తిశర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు, ఎంపీపీ శారద, సర్పంచ్ అంజలి, ప్రధాన అర్చకులు భావి కృష్ణమూర్తిశర్మ, అర్చకులు భావి శరత్‌చంద్రశర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు పాలకుర్తి శేఖర్, డైరెక్టర్లు రాజిరెడ్డి, రాజయ్య, రాజనర్సు తదితరులున్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



నిజాంసాగర్(జుక్కల్) : మండల కేంద్రంలోని చంద్రమౌళీశ్వరాలయంలో గురువారం శివ, పార్వతుల కల్యాణం మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గణపతి ఉపాసకులు సంజీవ్‌రావ్‌శర్మ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం వైభవోపేతంగా జరిపారు. అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్డిశెట్టి రాము, బాస్కర్, కాశీనాథ్, ప్రవీణ్, అశోక్, కిశోర్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక భావనను పెంచుకోవాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావనను పెంచుకోవాలని సోపాన్ మహరాజ్ శాస్త్రి సూచించారు. అంజని గ్రామంలో అఖండ హరినామ సాప్తహ కార్యక్రమంలో భాగంగా చివరి రోజు గురువారం కీర్తన్కార్ హరిభక్త్ పారయన్ శ్రీ సోపాన్ మహరాజ్ శాస్త్రీ ఆధ్వర్యంలో కాల కీర్తన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా బేతాళస్వామి జాతర



బాన్సువాడ : బాన్సువాడలో బేతాళస్వామి జాతర గురువారం ప్రారంభమైంది. మొదటి రోజు ఎడ్ల బండ్ల ప్రదర్శనతో వేడుకలు ప్రారంభించారు. బేతాళుడికి ఉదయం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జాతరలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఎడ్ల బండ్లను అలంకరించిన రైతులకు మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ ఆధ్వర్యంలో రూ.1100 చొప్పున నగదును అందజేశారు. గ్రామ పెద్దలు సుర్యకాంత్‌రావు, అర్షపల్లి గడిరెడ్డిలు మాట్లాడుతూ సుమారు 300 ఏళ్ల క్రితం బాన్సువాడలో వివిధ రోగాలతో ప్రజలు భయందోళనకు గురైతే పట్టణంలో బేతాళుడిని నెలకొల్పి ప్రతీ ఏడాది జాతర నిర్వహించే వారని అన్నారు.

కుస్తీ పోటీలకు ఉత్తరప్రదేశ్ మహిళా యోధులు

బాన్సువాడ బేతాళస్వామి జాతరలో భాగంగా శుక్రవారం కుస్తీ పోటీలు నిర్వహించనున్నారు. ప్రతీ ఏడాది కర్ణాటక, మహారాష్ట్ర నుంచి మల్లాయోధులు తరలివస్తారు. ఈసారి ఉత్తర ప్రదేశకు చెందిన మహిళ మల్లాయోధులను కుస్తీ పోటీల్లో దించేందుకు నిర్వహకులు ఏర్పాట్లు చేశారు.

సత్యసాయి సేవా సమితి నారాయణ సేవ



కామారెడ్డి అర్బన్ : సత్యసాయి సేవా సమితి కామారెడ్డి కేంద్రం ద్వారా నారాయణ సేవ కార్యక్రమం నిర్వహించారు. 400 మందికి మజ్జిగ, 42 మందికి అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా సమితి ప్రతినిధులు ఎస్.చంద్రకళ, టి.వెంకట లక్ష్మమ్మ, పి.సుగుణ తదితరులు పాల్గొన్నారు.

28న సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

కామారెడ్డి రూరల్ : మండలంలోని ఉగ్రవాయి శివారులోని షిర్డీ సాయిబాబా అష్టమ వార్షికోత్సవం ఈ నెల 28న నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు బచ్చు విజయ్‌కుమార్ తెలిపారు. 24న ఉదయం 8 గంటలకు బాబాకు గంగాజలంతో అభిషేకం, మధ్యాహ్నం 12కు విశేష హారతి, అన్నదానం ఉంటుందన్నారు.

ఘనంగా మత్తడి పోచమ్మ ఉత్సవాలు



నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్ నగర్ మండలంలోని బూర్గుల్‌లో గురువారం మత్తడి పోచమ్మ ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మత్తడి పోచమ్మకు ట్రాక్టర్లు, బోనాలతో ఊరేగింపు ర్యాలీ నిర్వహించారు. మహమ్మద్ నగర్ మండలంలోని బూర్గుల్ శుక్రవారం మల్లయోధులకు కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నటు గ్రామస్తులు తెలిపారు.

నేటి నుంచి బోర్లంలో..

బాన్సువాడ రూరల్ : మండలంలోని బోర్లంలో శుక్రవారం నుంచి మత్తెడి పోశమ్మ జాతర మహోత్సవాన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పాడి పంట, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ శుక్రవారం ఎడ్లబండ్లను అందంగా అలంకరించి గ్రామ శివారులోని మత్తెడి పోశమ్మ గుడి చుట్టూ ప్రదక్షిణలు చేయించి ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. శనివారం కుస్తీ యోధులకు పోటీలు నిర్వహిస్తారన్నారు.


భగవంతుడి ధ్యానంతోనే మానసిక ప్రశాంతత



మద్నూర్(జుక్కల్) : నిత్యం భగవంతుడి ధ్యానం చేస్తే మనస్సు ప్రశాంతంగా ఉంటుందని ఖత్‌గావ్ పీఠాధిపతి మల్లిఖార్జున శివాచార్య మహరాజ్ పేర్కొన్నారు. డోంగ్లీ మండలంలోని మొగా గ్రామంలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న అఖండ శివనామ సప్తాహంలో గురువారం మల్లిఖార్జున శివాచార్య మహరాజ్ పాల్గొని ప్రవచనాలు చెప్పారు. మొగాలో 9 ఏళ్లుగా శివనామ సప్తహం కొనసాగడం చాలా గొప్ప విషయమన్నారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

సంక్షిప్తం

సీఎం సభను సక్సెస్ చేయాలి..



నిజాంసాగర్(జుక్కల్) : జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి వస్తున్న సీఎం రేవంత్ రెడ్డి సభను జయప్రదం చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సూచించారు. గురువారం జుక్కల్ మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో సీఎం సభ జన సమీకరణపై మండల కాంగ్రెస్ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. సంగారెడ్డి జిల్లాలోని శంకరంపేట్‌లో జరుగనున్న సీఎం సభకు వాహనాలు సమకూరుస్తున్నామన్నారు. జహీరాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలన్నారు. కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్, అడ్వకేట్ రాంరెడ్డి, వినోద్, సంగమేశ్వర్ ఉన్నారు.

పాఠశాలల్లో మరమ్మతులు పూర్తవ్వాలి



గాంధారి(ఎల్లారెడ్డి) : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడం కోసం మరమ్మతు పనులను వీలైనంత తొందరగా పూర్తి చేయాలని ఎంపీడీవో రాజేశ్వర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అమ్మ ఆదర్శ పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం ఏర్పాటు మాట్లాడారు. స్కూళ్ల మరమ్మతుల కోసం నిధులు మంజూరయ్యాయని పనులను ప్రారంభించి నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్ సతీష్‌రెడ్డి, ఎంఈవో సేవులా పాల్గొన్నారు.

బాన్సువాడ రూరల్ : పాఠశాలలు పునఃప్రారంభమయ్యే సరికి అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు పూర్తి కావాలని బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్ సూచించారు. గురువారం ఆయన మండల కార్యాలయంలో తహసీల్దార్ వరప్రసాద్, ఎంఈవో నాగేశ్వరరావు, ఎంపీవో సత్యనారాయణ రెడ్డి, పంచాయతీరాజ్ ఇతర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలింగ్‌బూత్‌లు ఉన్న పాఠశాలల్లో పనులు పూర్తిచేయాలన్నారు. రేపటి నుంచి బృంద సభ్యులు గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించి ప్రాధాన్యత క్రమంలో పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తారన్నారు.

27న పీడీఎస్‌యూ సమావేశాన్ని సక్సెస్ చేయాలి

గాంధారి(ఎల్లారెడ్డి) : కొత్తగూడెం పట్టణంలో జరిగే ఈనెల 27న పీడీఎస్‌యూ జనరల్ కౌన్సిల్‌ను సక్సెస్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సతీష్ అన్నారు. గురువారం ఆయన స్థానిక విద్యార్థులు పాల్గొనాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు మోజీరాం నాయక్, తారాచంద్ తదితరులున్నారు.

బీఎల్‌వోలకు అవగాహన

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండల కేంద్రంలో ఆయా గ్రామాలకు చెందిన బీఎల్‌వోలకు తహసీల్దార్ ప్రవీణ్ అవగాహన కల్పించారు. ఓటరు స్లిప్పులు పంపిణీ, బ్యానర్ల ఏర్పాటు, స్టిక్కర్లను అతికించి ఓటర్లను చైతన్యపర్చాలన్నారు. గిర్దావార్ హన్మాండ్లు, ఎంపీవో రాము జీపీలు పాల్గొన్నారు.